జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 41 2-7-2025 బుధవారం పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.



## మాంసపు ముద్దలు
# బూడిద కుప్పలు

### 46కి చేరిన మృతుల సంఖ్య.. 9 మంది గల్లంతు

ఆస్పత్రుల్లో 30 మందికి చికిత్స.. వారిలో 10 మంది పరిస్థితి విషమం

'సిగాచి' శిథిలాల నుంచి మరో 16 మృతదేహాల వెలికితీత

వాటిలో 13 గుర్తింపు.. కుటుంబసభ్యులకు అప్పగింత

పేలుడు తీవ్రతకు మాంసంముద్దలు, బూడిద కుప్పలుగా

మృతదేహాలు.. డీఎన్ఏ పరీక్షకు ఎముకలు, దంతాల సేకరణ

సాగుతున్న గాలింపు.. మృతుల సంఖ్య పెరిగే ముప్పు

పరిశ్రమ ఎండీ చిదంబరనాథ్ ఎక్కడ?.. రెండు రోజులుగా

ఆయన పరిశ్రమవైపుగా రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం

అక్కడే ప్రేమించుకుని.. అక్కడే కన్నుమూసి

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో ఓ యువ జంట మృత్యువాత

2లో

## గోదావరి-బనకచర్ల రాచపుండు
# రాజేసింది కేసీఆరే

- చచ్చిన పాము లాంటి బీఆర్ఎస్‌ను లేపేందుకే ఈ వివాదం
- అబద్ధాలనే నమ్ముకున్న కేసీఆర్ కుటుంబం
- తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టింది వారే
- జలవివాదాలపై కేంద్రం పెద్దన్నలా ఉండాలి
- రాష్ట్రాల మధ్య వివాదాలు తేల్చకుండా..
- జుట్లు పట్టుకొని ఆడించాలనుకుంటోంది
- కిషన్‌రెడ్డి తీరు అనుమానం కలిగిస్తోంది
- ప్రభుత్వాన్ని బద్‌నాం చేసే కుట్ర
- దుష్ప్రచారాన్ని గ్రామగ్రామానా వివరించాలి
- రాష్ట్ర హక్కులను కాపాడటమే లక్ష్యం కావాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం పిలుపు
- బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో చర్చిద్దాం.. రావాలని బీఆర్ఎసకు రేవంత్ సవాల్
- బనకచర్లను అడ్డుకుంది మేమే: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,(సందేశం టైమ్స్, జులై 1): బీఆర్ఎస్ చచ్చిన పాము అని, ఆ పామును బతికించేందుకు గోదావరి-బనకచర్ల వివాదాన్ని వాడుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నీళ్ల సెంటిమెంటే పార్టీని బతికిస్తుందనుకుంటున్నారని, అందుకోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను భూతాలుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. "క్షుద్రపూజలు చేసే ఫామ్‌హౌస్ నాయకుడికి ఈరోజు ఇదొక్కటే జీవనాధారంగా మారింది. అందుకే ప్రభుత్వాన్ని బద్‌నాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అబద్ధాలతో బతికే బీఆర్ఎస్ 2023లో అధికారం కోల్పోయింది. 2024లో డిపాజిట్లు కోల్పోయింది. 2025 ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు కూడా దొరకలేదు. ఇది ఆ పార్టీ రాజకీయ పరిస్థితి. దీంతో నదుల పునరుజ్జీవం పేరుతో బీఆర్ఎస్ పునరుజ్జీవం కోసం తాపత్రయ పడుతున్నారు" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మంగళవారం.. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు మిగతా 2లో...

## బీవీ పట్టాభిరామ్
# కన్నుమూత



హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 1): ప్రముఖ ఇంద్రజాలికుడు బీవీ పట్టాభిరామ్ మరణించారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని స్వగృహంలో ఆయన గుండెపోటుతో మరణించారు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. హిప్నాటిస్టుగా ఆయన పేరు పొందారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్వగృహం వద్ద అభిమానుల సందర్శనార్థం పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచుతారు. అనంతరం మధ్యాహ్నం 3.00 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు. వ్యక్తిత్వ వికాసంపై ఆయన పలు పుస్తకాలు రాశారు. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు.

1949లో బీవీ పట్టాభిరామ్ జన్మించారు. ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా. ఆయన తండ్రి పేరు రావ్ సాహెబ్ భావరాజు సత్యనారాయణ. కౌమారదశలో కాలి వైకల్యం కారణంగా.. ఆత్మన్యూనతా భావాన్ని జయించేందుకు ఇంద్రజాలికుడిగా, రచయితగా తనను తాను తీర్చిదిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్యను ఆయన అభ్యసించారు. ఆ సమయంలో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి వద్ద ఆ విద్యను ఆయన నేర్చుకున్నారు. ఒకటి రెండు టాలీవుడ్ చిత్రాల్లో సైతం ఆయన నటించారు.

దాదాపు అర్ధ శతాబ్దం పాటు ఆయన ఇంద్రజాలికుడిగా, సైకాలజీస్టుగా సమాజానికి సేవలందించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సైకాలజీ, ఫిలాసఫీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు.

## రేవంత్‌రెడ్డీ..
# చెరువుల్లో కట్టిన మీ నేతల ఇళ్లు కనబడటం లేదా?





హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 1): "చెరువుల పరిసరాల్లో ఇళ్లు కట్టారంటూ పేదల ఇళు కూలుస్తున్న నీకు.. అదే చెరువుల్లో మీ పార్టీ నేతలు అక్రమంగా కట్టిన భవంతులు కనబడటం లేదా.. మిస్టర్ రేవంత్‌రెడ్డి.." అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "కొడంగల్‌లో రెడ్డికుంటని పూడ్చేసి.. నువ్ మహల్ కట్టొచ్చు.. మీ అన్న తిరుపతిరెడ్డికి దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు ఉండొచ్చు.. మీ రెవెన్యూ మంత్రి హిమాయత్ సాగర్‌లో ప్యాలెసలు కట్టొచ్చు.. మీ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి చెరువు నడుమ గెస్ట్‌హౌస్, బఫర్ జోన్‌లో కేవీపీలాంటి పెద్దలు గెస్ట్ హౌసులు కట్టుకుంటే కనబడటం లేదా? పెద్ద బిల్డర్లు మీకు లంచం ఇచ్చి మూసి నదిలోనే అపార్ట్‌మెంట్లు కట్టుకుంటే.. అవి మీకు కనబడవు.. తమ ఇళ్లు కూల్చొద్దని, హైకోర్టు స్టే ఆర్డర్ ఉందని నిరుపేదలు నెత్తినోరు మొత్తుకున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపకపోవడం దుర్మార్గం" అని కేటీఆర్ మండిపడ్డారు.

రాజ్యాంగం చేతిలో పట్టుకొని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే రాహుల్‌గాంధీకి తెలంగాణలో అమలవుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ప్రజల తరపున ప్రశ్నిస్తామని, కాంగ్రెస్ హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజలను అయోమయంలో పడేసేందుకు కేసీఆర్‌ను తిట్టాలి.. చంద్రబాబును కాపాడాలి.. ఇదే సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహమని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు బనకచర్ల ప్రతిపాదనే లేదని, కేంద్రం బనకచర్లకు పర్యావరణ అనుమతులు నిరాకరించడం బీఆర్ఎస్ సాధించిన విజయమని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో బనకచర్ల ఊసేలేదు



### అవగాహన లేని సీఎం ఉండటం తెలంగాణ దౌర్భాగ్యం
### కాంగ్రెసను మేమే నిద్రలేపాం : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 1): తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రస్తావనేరాని బనకచర్ల ప్రాజెక్టు, ఇప్పుడు ఎవరి అండ చూసుకుని ముందుకు వచ్చిందో తెలంగాణ ప్రజలకు తెలియదా? అని మాజీమంత్రి హరీశ్‌రావు నిలదీశారు. తమ హయాంలోనే ప్రాజెక్టుకు సహకరించామంటూ సీఎం చెబుతున్నవన్నీ అబద్ధాలేనని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమైతే.. కాంగ్రెసను నిద్రలేపింది తామేనని, బీఆర్ఎస్ చేసిన పోరాటం వల్లే బనకచర్లకు పర్యావరణ అనుమతులు లభించలేదని మంగళవారం ఎక్స్‌వేదికగా ఆయన తెలిపారు. రాష్ట్ర సాగు నీటి ప్రయోజనాల దృష్ట్యా.. అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేయాలని సీఎం ఎందుకు డిమాండ్ చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు పట్ల రేవంత్‌రెడ్డి చూపుతున్న గురు భక్తికి ఇది నిదర్శనం కాదా?.. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మిగతా 2లో...

# ఆరు నెలల్లో 126 ఏసీబీ కేసుల నమోదు

హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 1):వరుస దాడులతో అవినీతి అధికారులు, ఉద్యోగుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు ఏసీబీ అధికారులు. ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరంలో 126 కేసులను నమోదు చేసిన అధికారులు 125 మందిని అరెస్టు చేశారు. లంచం కేసులకు సంబంధించి ఈ ఆరు నెలల్లో రూ.24,57,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్లో రూ.27,66,60,526 ఆస్తులను వెలికి తీశారు. ఆ ఆస్తుల మార్కెట్ విలువ రూ.600 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు.

ఆరు నెలల కాలంలో 129 కేసుల్లో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి తుది నివేదికను పంపించామని ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల్లో నమోదు చేసిన 126 కేసుల్లో 80 ట్రాప్ కేసులని, 8 అక్రమాస్తుల కేసులని, 11 ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని, 14 నేరపూరిత దుష్ప్రవర్తన కేసులని, 10 రెగ్యులర్ విచారణలు నిర్వహించామని, 3 అంతర్గత విచారణలు నిర్వహించామని వివరించారు. అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల్లో ఈసారి ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు పట్టుబడటం కీలక పరిణామం.

# మాంసపు ముద్దలు బూడిద కుప్పలు

సంగారెడ్డి ప్రతినిధి, పటాన్‌చెరు, పటాన్‌చెరు రూరల్, దండేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిగాచి రసాయన పరిశ్రమలో పేలుడు మృతుల సంఖ్య మంగళవారం అర్ధరాత్రి సమయానికి 46కి చేరింది. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జరిగిన ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య సోమవారం అర్ధరాత్రి సమయానికే 20కి చేరినట్టు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద మంగళవారం సాయంత్రానికి మరో 16 మృతదేహాలను వెలికితీశారు. మరోవైపు.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారిలో ఐదుగురు చనిపోయినట్లు తెలిసింది. తీవ్రగాయాలతో ఆస్పత్రుల్లో ఉన్న 30 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా.. మరో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు సమాచారం. ఇక.. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడున్నవారిలో 14 మంది ఆచూకీ మంగళవారం సాయంత్రం వరకూ తెలియరాలేదు. వారిలో ఐదుగురి మృతదేహాలను అర్ధరాత్రి సమయానికి గుర్తించినట్టు సమాచారం. మిగిలిన 9 మంది ఆచూకీ ఇంకా తెలియకపోవడం.. ఆస్పత్రుల్లో ఉన్న పలువురి పరిస్థితి విషమంగా ఉండడంతో.. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా.. పరిశ్రమలో పేలుడు తీవ్రతకు కూలిన మూడంతస్తుల భవనం శిథిలాలు తొలగించిన కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా.. ప్రమాదస్థలికి సమీపంలో ఎక్కడ చూసినా మాంసపు ముద్దలు.. బూడిదకుప్పలే కనిపిస్తున్నాయి. ఇప్పటిదాకా దొరికిన మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. వాటిలో ఇప్పటిదాకా 13 మృతదేహాలను గుర్తించగా.. మిగతా మృతదేహాలు ఎవరివో గుర్తించాల్సి ఉంది. గుర్తించలేనంతగా కాలిపోవడంతో ఏ మృతదేహం ఎవరిదో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో అన్ని మృతదేహాలకూ పోస్టుమార్టంతోపాటు డీఎన్‌ఏ పరీక్షలూ నిర్వహిస్తున్నారు. కాగా, పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీ గోడలు కూలి, మంటల్లో చిక్కుకొని కాలిన గాయాలతో చనిపోయినవారిని వారి కుటుంబసభ్యులు గుర్తించగలిగారు. కానీ.. ప్రమాద స్థలానికి సమీపంలో విధులు నిర్వర్తిస్తూ.. పేలుడు ధాటికి మాంసపు ముద్దలుగా మారిన వారిని మాత్రం గుర్తించలేని పరిస్థితి. వారిలో కొందరి మృతదేహాలు పూర్తిగా కాలి బూడిదకుప్పలుగా మారినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో.. ఫోరెన్సిక్ నిపుణులు మంగళవారం ఘటనాస్థలికి చేరుకుని దాదాపు 4 గంటలపాటు శ్రమించి.. పేలుడు జరిగిన ప్రదేశంలో ఉన్న ఎముకలు, దంతాలు, ఇతర నమూనాలు సేకరించారు. ఎముకలు, దంతాలతోపాటు బూడిదను కూడా కవర్లలో సేకరించినట్లుగా తెలుస్తున్నది.

గల్లంతైనవారు ఎక్కడ?

ప్రమాద సమయంలో పరిశ్రమలోని అన్ని విభాగాల్లో 143 మంది ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇందులో 58 మంది సురక్షితంగా ఉన్నారని ప్రకటించారు. 46 మంది చనిపోతే 30 మంది ఆస్పత్రుల్లో ఉన్నారు. ఈ లెక్కన మరో 9 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. వారి మృతదేహాలు కూడా శిథిలాల కిందే ఉన్నాయా? అనే విషయంపై స్పష్టత రావడం లేదు. దీంతో.. గల్లంతైన తమవారి ఆచూకీ చెప్పాలంటూ వారి బంధువులు అధికారులను వేడుకుంటున్నారు. మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతుండడంతో.. రెండు రోజులుగా పరిశ్రమ పరిసరాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. కాగా.. ఈ ప్రమాదంలో మరణించినవారిలో ఇప్పటిదాకా 13 మందిని గుర్తించిన అధికారులు.. వారి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. దాంతోపాటు తక్షణ సాయంగా ఒక్కొక్క కుటుంబానికీ రూ.లక్ష చొప్పున.. రూ.13లక్షలను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అందజేశారు. క్షతగాత్రుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఇచ్చారు. వారు స్వస్థలాలకు వెళ్లడానికి అధికారులే అంబులెన్సులు ఏర్పాటు చేశారు.

## గోదావరి-బనకచర్ల రాచపుండు రాజేసింది కేసీఆరే

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. జలవివాదాలపై పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వివాదం పరిష్కారమైతే తెలుగు రాష్ట్రాలు తమ వద్దకు రావని, పంచాయితీ ఇలాగే కొనసాగితే ఇద్దరి జుట్లు పట్టుకొని ఆడించవచ్చనేదే కేంద్ర ప్రభుత్వ విధానమని అన్నారు. నీటి కేటాయింపులు, హక్కులు కాపాడుకోవడానికి కేంద్రంపై నిరంతరం ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో బనకచర్ల ఊసేలేదు

రాష్ట్ర సాగు నీటి వనరులు, నదీజలాల వాటాపై కనీస అవగాహన లేని వారు ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యమని పేర్కొన్నారు.

అందాల పోటీల కోసం తరచూ రివ్యూలుపెట్టిన సీఎం యూరియా సరఫరాపై ఒక్కసారి సమీక్షించినా.. ఇప్పుడు యూరియా కొరత వచ్చేది కాదన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆధారంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని మూడు బడ్జెట్ ప్రసంగాల్లోనూ (ఓటాన్ అకౌంట్‌తో సహా) చెప్పారని.. కానీ రూపాయి కూడా విదల్చలేదని చెప్పారు. 'పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చడం దుర్మార్గమని, రేవంత్‌రెడ్డి సాగిస్తున్న ఈ అరాచకాన్ని ఆపలేరా? మీనాక్షీ నటరాజన్' అంటూ.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు ప్రశ్నించారు. కోర్టు స్టే ఉన్నా.. ఇళ్ల కూల్చివేతకు పాల్పడటం న్యాయవ్యవస్థను అవమానించడమేనన్నారు. ఉత్తరప్రదేశ్ తరహా 'బుల్డోజర్‌పాలన'ను తెలంగాణలో నడపొద్దని రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. తెలంగాణ సీఎంను రాజ్యాంగ విలువలకు, కాంగ్రెస్ చెబుతున్న సిద్ధాంతాలకు లోబడి నడుచుకునేలా ఆదేశించాలని మీనాక్షిని ఆయన కోరారు.

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

## హెచ్‌ఆర్సీ కమిషన్ చైర్మన్

(సందేశం టైమ్స్, జులై 1):చౌటుప్పల్ : ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ సమస్యలతో వచ్చే పేషెంట్లకు డాక్టర్లు నాణ్యమైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఇవాళ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సందర్శించారు. హాస్పిటల్ లోని మెడికల్, క్యాజువాలిటీ, ఐసీయూ, మెడికల్ కేర్, జనరల్ సర్జికల్ వార్డు, మెడికల్ స్టోర్, డయాలసిస్,



ఎక్స్ రే తదితర వార్డులను, ఆస్పత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు.చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్లు తదితరులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల

# జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్!

హైదరాబాద్,(సందేశం టైమ్స్, జులై 1): జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్‌పై అతి త్వరలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క... టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌కు తెలిపారు. వెంటనే భర్తీ చేయడానికి వీలున్న పోస్టులనూ ఈ సమావేశంలో గుర్తించనున్నట్లు భట్టి చెప్పారు. మంగళవారం కోదండరాం, రియాజ్, దయాకర్ ప్రజాభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి, భట్టిలను కలిశారు. జాబ్ క్యాలెండర్‌ను రీషెడ్యూల్ చేసి ఉద్యోగాల భర్తీకి త్వరితగతిన నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలను కూడా వారి దృష్టికి తెచ్చారు. ఈ అంశాలపై సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించారు. ఎస్సీ వర్గీకరణ, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించే క్రమంలో నోటిఫికేషన్లు కాస్త ఆలస్యమయ్యాయని, అవి పూర్తయినందున నోటిఫికేషన్ల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందన్నారు. పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వాల్సింది ఆర్థిక శాఖ అని, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో మాట్లాడాలని సూచించారు. ఈ సందర్భంగా వారితో భట్టి మాట్లాడుతూ వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి అతి త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. జాబ్ క్యాలెండర్ రీషెడ్యూల్ పైనా కసరత్తు జరుగుతుందని హామీ ఇచ్చారు. కాగా, భట్టి సమీక్ష వారం రోజుల్లోపే ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# గన్‌వాడీ కోడి గుడ్ల టెండర్ రద్దు





హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 1):: అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టు జోనల్ టెండర్ రద్దు చేశారు. నిబంధనల సడలింపు పేరుతో పలుమార్లు గడువు పెంచిన మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు చివరకు టెండర్‌ను ఆపేశారు. పరిపాలనా కారణాల వల్లే టెండర్ రద్దు చేశామని ప్రకటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల విద్యాసంస్థలు, రెసిడెన్షియల్, వసతి గృహాలతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమయ్యే గుడ్ల సరఫరాకు కలిపి డీసెంట్రలైజ్డ్ టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం పునరాలోచన చేస్తోంది. రాష్ట్రంలోని 35,781 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దాదాపు 19.60 లక్షల మంది మహిళలు, చిన్నారులు లబ్ధిపొందుతున్నారు. వీరికి ఏడాదికి 36.96 కోట్ల గుడ్ల సరఫరాకు ఈ ఏడాది మార్చిలో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 10లోపు బిడ్లు దాఖలు చేయాలని పేర్కొని.. నిబంధనల సడలింపు పేరుతో ఏప్రిల్ 15, ఆ తర్వాత మే 15, జూన్ 16వరకు గడువు పెంచి.. చివరకు జూన్ 30వరకు పొడిగించారు. సోమవారంతో బిడ్లు సమర్పించే గడువు ముగిసి.. మంగళవారం టెండర్ తెరవాల్సి ఉండగా.. ఈసారి ఏకంగా టెండర్ రద్దు చేశారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గురుకుల, రెసిడెన్షియల్, వసతి గృహాలు, మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే కోడి గుడ్లను అందించడానికి ఈసారి డీసెంట్రలైజ్డ్ టెండర్లు పిలవాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వీటన్నింటికి ఏడాదికి దాదాపు 70–80 కోట్ల వరకు గుడ్లు అవసరమవుతాయి. అయితే, ఉమ్మడి జిల్లాల వారీగా గుడ్లు సరఫరా అయ్యేలా టెండర్లు నిర్వహించాలా..? లేక కొత్త జిల్లాల వారీగా టెండర్లు పిలవాలా..? అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. డీసెంట్రలైజ్డ్ టెండర్ ద్వారా కాంట్రాక్టు దక్కించుకున్న వారు ఆ జిల్లాకు అంగన్‌వాడీ, గురుకులాలు, రెసిడెన్షియల్, హాస్టళ్లు, మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే గుడ్లను అందించనున్నారు. ఇప్పటికే పాఠశాలలు పునః ప్రారంభమై 20 రోజులు గడిచినా.. గుడ్ల సరఫరా టెండర్ల విషయంలో ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత కాంట్రాక్టర్ల ద్వారానే సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు.

# గురుకులాల డైట్ చార్జీలకు రూ.170 కోట్లు



**ఏప్రిల్ దాకా బకాయిల నిధులు విడుదల**

**నెలాఖరుకు విద్యార్థులకు యూనిఫాంలు**

**ఇకపై ఏ నెలకు ఆ నెల బిల్లుల చెల్లింపు**

**సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

హైదరాబాద్,(సందేశం టైమ్స్, జులై 1):: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపునకు అవసరమైన నిధులు విడుదల చేశామని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రకటించారు. ఇందులో డైట్ చార్జీల కోసం రూ.170 కోట్లు విడుదల చేశామని తెలిపారు. అలాగే, ఈ నెలాఖరులోగా విద్యార్థులందరికీ యూనిఫాంలు అందిస్తామని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలకు సంబంధించిన వివిధ అంశాలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్.. సంక్షేమ శాఖ అధికారులతో సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆపై, మంత్రి లక్ష్మణ్ వినతి మేరకు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కూడా సంక్షేమ శాఖ అధికారులతో ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి అడ్లూరి విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా విద్యార్థులకు యూనిఫాంలు అందిస్తామని ప్రకటించారు. అన్ని గురుకుల పాఠశాలలకు 2025 ఏప్రిల్ వరకు ఉన్న పెండింగ్ బిల్లులు మంజురు చేశామని వెల్లడించారు. డైట్ చార్జీల కోసం రూ.170 కోట్లు విడుదల చేశామని తెలిపారు. అలాగే, అద్దె బకాయిలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకు కావాల్సిన నిధులు కూడా మంజూరు చేసినట్టు వెల్లడించారు. అన్ని గురుకులాల్లోని ఉద్యోగుల వేతనాల కోసం రూ.100 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఇకపై బకాయిలు లేకుండా ప్రతి నెలా డైట్, అద్దె బిల్లులను చెల్లిస్తామని ప్రకటించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అడ్లూరి వివరించారు. పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం జరిగే అసెంబ్లీలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి అడ్లూరి చెప్పారు.

చేనేత రుణమాఫీకి రూ.33 కోట్లు

చేనేత కార్మికుల రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 33 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

# కొడుకు ప్రవర్తనతో విసిగిపోయిన తండ్రి.. ఏం చేశాడంటే..




ఎన్టీఆర్ జిల్లా(సందేశం టైమ్స్, జులై 1): తమ సంతానంపై తల్లిదండ్రులు ఎంతో ప్రేమ పెంచుకుంటారు. అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేస్తారు. కానీ చివరికి పెద్ద అయిన తర్వాత తల్లిదండ్రులను కన్న కొడుకు తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. కొడుకు ప్రవర్తనతో విసిగిపోయిన తండ్రి తన పేగు బంధాన్ని కూడా తెంచ్చుకునే స్థితికి తీసుకువచ్చాడు ఓ కసాయి కొడుకు. తాజాగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో ఓ తండ్రి తన కసాయి కొడుకును అతి దారుణంగా హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో వెంకట నారాయణ (35) అనే వ్యక్తి తాగుడుకు బానిస అయ్యాడు. రోజూ పీకల దాక తాగి ఇంటికి వచ్చి తన తల్లిదండ్రులను కొడుతుండేవాడు. తమను కొట్టవద్దని, తాగుడు బంద్ చేయాలని తల్లిదండ్రులు ఎన్నోసార్లు వెంకటనారాయణకు నచ్చచెప్పారు. కానీ వెంకన్నారాయణ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. రాత్రి సమయంలో పీకల దాక తాగి ఇంటికి వచ్చి తన తల్లిదండ్రులతో వెంకట నారాయణ గొడవ పడి వారిని విచక్షణ రహితంగా కొట్టాడు. చివరికి తండ్రి కొడుకులకు మధ్య జరిగిన కొట్లాటలో కొడుకుని తండ్రి చంపివేశాడు.రాత్రి 10 గంటల సమయంలో బాగా మందు తాగి తల్లిదండ్రులను వెంకటనారాయణ కొట్టాడు. ఈ క్రమంలో తండ్రి గోళ్ల కృష్ణ కుమారుడిని చెక్క మొద్దుతో కొట్టడంతో అక్కడికక్కడే వెంకటనారాయణ మృతి చెందాడు. ఈ ఘటనపై ఎన్టీఆర్ జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. వెంకటనారాయణకి కృష్ణ కుమారితో సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఐదు సంవత్సరాల క్రితం భర్తను వదిలేసి భార్య కృష్ణకుమారి వెళ్లిపోయింది.

# స్మార్ట్ మీటర్లు, చార్జీల పెంపుపై ఉద్యమం

అమరావతి,(సందేశం టైమ్స్, జులై 1): రాష్ట్రంలో విద్యుత్తు చార్జీల పెంపు, అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని త్వరలోనే కార్యాచరణ రూ పొందించాలని సోమవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో నిర్ణయించాయి. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయడు వి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తదితరులు హాజరయ్యారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు ప్రాంతంలో




షిర్డిసాయి అనుబంధ ఇండోసోల్ కంపెనీకి భూములను అతి తక్కువ ధరలకే అప్పగించేందుకు చేస్తున్న భూ సమీకరణను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు చేస్తున్న ఆందోళనకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. కరేడులో పర్యటించి స్థానిక రైతులతో మాట్లాడి ప్రత్యక్ష ఆందోళనకు సమాయత్తం కావాలని నిర్ణయించారు. ఈ నెల 9న అఖిల భారత కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు వామపక్షాలు సంఘీభావం ప్రకటించాయి.

# అవుకు పీఎస్పీ అనుమతులు రద్దు

అమరావతి, (సందేశం టైమ్స్, జులై 1): అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రం (పీఎస్‌పి) నిర్మాణానికి 'ఆరో' ఇన్‌ఫ్రా సంస్థకు ఇచ్చిన అనుమతులను రాష్ట్ర ఇంధన శాఖ రద్దు చేసింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయడంలో తీవ్రజాప్యం నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలంటూ ప్రభుత్వానికి రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీక్యాప్) సిఫారసు చేసింది.



జాప్యానికి కారణాలు వివరించాలంటూ 'ఆరో' సంస్థకు నోటీసులు పంపినా ఫలితం లేకపోయింది. ఇంకోవైపు.. ప్రాజెక్టు నిర్మాణంలో అధిక ఆలస్యం జరుగుతుండడంతో అనుమతులు రద్దు చేస్తూ ఇంధనశాఖ తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు.కాగా, కడప జిల్లా కమలాపురం మండలం కొప్పోలులో చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 360 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాన్ని స్థాపించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులిస్తూ ఇంధన శాఖ ఉత్తర్వు జారీ చేసింది. అలాగే కడప జిల్లా గండికోట వద్ద అదానీ సంస్థ చేపట్టదలచిన 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రం సామర్థ్యాన్ని 1,800 మెగావాట్లకు పెంచేందుకూ సమ్మతిస్తూ ఆదేశాలిచ్చింది.

# 5 వేల మినీ అంగన్వాడీల అప్‌గ్రేడ్



అమరావతి, (సందేశం టైమ్స్, జులై 1):: రాష్ట్రంలోని 7 వేల మినీ అంగన్వా డీ కేంద్రాలకుగాను, 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలకు మెయిన్ అంగన్వాడీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు విడుదలవుతాయని తెలిపారు. మినీ అంగన్వాడీల్లో ఇప్పటి వరకు ఒక్క కార్యకర్తలు మాత్రమే పనిచేసే వారని, ఆయాలు ఉండేవారు కాదని తెలిపారు. మినీకి మెయిన్ అంగన్వాడీ హోదా కల్పించి న తర్వాత, ఆ 5వేల మందికి పూర్తిస్థాయి అంగన్వాడీ టీచర్ హోదా ఇస్తూ చట్టబద్ధమైన వేతనాలు, విధులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ కేంద్రాల్లో అంగన్వాడీ 5 వేల మంది ఆయాల నియామకానికి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# గడువులోపు సమస్యల పరిష్కారానికి కృషి

## వినతిపత్రం అందజేస్తున్న జీడిరైతు సంఘం నాయకులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పలాస (సందేశం టైమ్స్, జులై 1): ప్రజలు సమస్యలపై ఇచ్చే వినతులను పరిశీలించి నిర్ణీత గడువులోగా వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పలాస ట్రెజరీ కార్యాలయం ఆవరణలో కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్).. 'మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌స్థాయిలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. జీడి పంటకు గిట్టుబాటు ధరపై ఇచ్చినహామీని అమలు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు టి.అజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో ఆస్తుల ఆక్రమణలు తొలగించి బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణతర్లాలో సర్వేనెంబరు 56/1లోని కస్పావీధి, పెద్దవీధి, నడిమివీధి, చాకలివీధి, పూన వీధులు ప్రభుత్వం గ్రామకంఠంగా గుర్తించింది. దీంతో ఆస్తుల క్రయవిక్రయాలు జరగక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు పరిశీలించి వాటిని తొలగించాలని జిల్లా ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరు వి.యాదగిరి, గ్రామస్థులు ఆళ్ల కృష్ణారావు, పూన రత్నాకర్, సురేంద్ర వినతిపత్రం అందజేశారు. ఇలా చాలామంది పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. కలెక్టర్ హాజరుకానున్నారని తెలిసి ఉదయం నుంచీ తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులుదీరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భూములు.. స్థలాల



ఆక్రమణ, భూముల సరిహద్దుల మార్పు, మ్యూటేషన్స్, లబ్ధిదారుల పేర్లు మార్పు తదితర సమస్యలపై అధికంగా వినతులు వచ్చాయన్నారు. ఈ వినతులు సంబంధిత శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి.. సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, ఆర్డీవో జి.వెంకటేష్, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ రామారావుతో పాటు రెవెన్యూ, మునిసిపల్, సచివాలయం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం బకాయిల కోసం రైతుల ధర్నా

అమరావతి, (సందేశం టైమ్స్, జులై 1): రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలోని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరభ్ గౌర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ మనజీర్ జిలానీ




సమూన్‌లను కలసి వినతిపత్రాలు అందజేశారు. వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని రైతు సంఘాల ప్రతినిధులు తెలిపారు.

# అగ్రహారం భూ సమస్య పరిష్కరించాలి



## మంత్రికి సమస్య వివరిస్తున్న విప్ అశోక్, కొర్లాం రైతులు

సోంపేట, (సందేశం టైమ్స్, జులై 1): కొర్లాం అగ్రహా రం పరిధిలోని 250 ఎకరాలు భూ సమస్య పరిష్కరించేం దుకు కృషి చేయాలని ఆ గ్రామ రైతులతో కలిసి విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని కలిసి ఆ గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అగ్రహారం భూములు సాగుచేస్తున్న రైతుల పేరుతోకాకుండా వేరొకరి పేరుతో నమోదు అ య్యాయని, దీంతో రైతులకు 1బీలు రావడం లేదన్నారు. అందువల్ల ఈ సమస్య పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరడ చంద్రమోహన్, రత్నాల వెంకట రమణ, రాంబుడ్డి గణపతి, సోమేశ్వరరావు ఉన్నారు.

# మరింత లోతుగా దర్యాప్తు

నరసన్నపేట, (సందేశం టైమ్స్, జులై 1): : వైసీపీ ప్రభుత్వ హయాంలో నరసన్నపేట సామాజిక ఆస్పత్రిలోని సదరంలో సకలాంగులకు దివ్యాంగులుగా పత్రాలు జారీ చేసిన కేసుపై స్థానిక పోలీసులు మమ్మురంగా దర్యాప్తు చేస్తున్నారు. గతంలో పనిచేసిన డీసీహెచ్ రాజ్యలక్ష్మి, ఆస్పత్రి సిబ్బందిని నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. అప్పట్లో నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో పొందూరు, ఆమదాలవలస, కోటబొమ్మాళి, నరసన్నపేట, జలుమూరు మండలాలకు చెందిన పలువురు సకలాంగులకు దివ్యాంగులుగా ధ్రువీకరణ పత్రాలు జారీచేశారు. ఆ పత్రాలు ద్వారా చాలామంది పింఛన్లు, ఇతర సౌకర్యాలతో లబ్ధి పొందారు. కొన్నాళ్ల తర్వాత ఈ వ్యవహారం బయటపడడంతో అప్పటి కలెక్టర్ దర్యాప్తునకు



ఆదేశించారు. ఈ మేరకు డీసీహెచ్ రాజ్యలక్ష్మి విచారణ చేపట్టి.. అనర్హులకు దివ్యాంగులుగా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్టు వాస్తవమేనని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఏడు నెలలు కిందట వైద్యవిధాన పరిషత్ అధికారులు సంబంధిత వైద్యులు, సూపరెంటెండెంట్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేసి శాఖాపరంగా దర్యాప్తు చేపట్టింది.

# దుబాయిలోనూ దుకాణం

- ♦ అద్విక ఏర్పాటుకు భారీ స్కెచ్
- ♦ పలుమార్లు అక్కడికి వెళ్లొచ్చిన ఆదిత్య
- ♦ తాజాగా 42 మంది ఏజెంట్లకు నోటీసులు
- ♦ తిరిగొస్తానని ఏజెంట్లకు చెబుతున్న ఆదిత్య
- ♦ రంగంలోకి రాజకీయ దళారులు
- ♦ డబ్బు ఇప్పిస్తామంటూ ఏజెంట్లతో బేరాలు



(సందేశం టైమ్స్, జులై 1) విజయవాడ : విజయవాడలో అద్విక ట్రేడింగ్ కంపెనీ ఏర్పాటుచేసి రూ.కోట్లు లూటీ చేసిన తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య దుబాయిలోనూ ట్రేడింగ్ కంపెనీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకున్నాడు. అందుకే ఇక్కడ పెట్టుబడిదారుల నుంచి వసూలు చేసిన డబ్బును దుబాయిలోని కబానా ట్రేండింగ్ కంపెనీకి పంపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నామని ఏజెంట్లకు, ఖాతాదారులకు ఆదిత్య చెప్పినట్టు తెలిసింది. అద్వికలో డైరెక్టర్‌గా కిరణ్‌కుమార్, గిరి, సలహాదారురాలిగా ఉన్న కీర్తిని తీసుకుని పలుమార్లు దుబాయి వెళ్లి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. కొన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఐబిస్, వెస్టన్ స్టార్ హోటళ్లలో రెండు బిజినెస్ మీట్లు నిర్వహించినట్టు ఏజెంట్లు చెబుతున్నారు. ఈ సమావేశాలకు దుబాయిలోని కబానా సంస్థకు చెందిన ప్రతినిధులను తీసుకొచ్చాడని తెలుస్తోంది. పోలీసులు ఎంత విచారణ చేసినా ఆదిత్య మాత్రం నోరు విప్పట్లేదు. ఏజెంట్లను పిలిపించి విచారణ చేసి వివరాలను తెలుసుకోవాల్సి వస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 35 మంది ఏజెంట్లు ఉంటారని భావించారు. ఇప్పుడు ఈ సంఖ్య 42కు పెరిగింది. వాళ్లందరికీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఒక్కో ఏజెంట్‌ను పిలిపించి వివరాలు తెలుసుకుంటున్నారు. ఆ ఏజెంట్లు ఎంత మొత్తంలో పెట్టుబడి పెట్టారు, ఎంతమందితో ఎంతెంత మొత్తంలో పెట్టుబడి పెట్టించారు, పేఅవుట్లు (చెల్లింపులు) ఎంత మొత్తం తీసుకున్నారు అనే వివరాలు బయటకు లాగుతున్నారు. ఆదిత్య మొత్తం డేటాను డిలీట్ చేయడంతో లెక్కలు తేల్చడానికి నానాపాట్లు పడాల్సి వస్తోంది. ఏజెంట్లు ఇచ్చిన లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

**ఇలా పెట్టుబడి.. అలా చెల్లింపులు...**

ఆదిత్య వాట్సాప్ చాటింగ్‌లను పరిశీలించిన పోలీసులకు ఒక విషయంలో మాత్రం స్పష్టత వచ్చింది. పెట్టుబడిగా వచ్చిన ఏ ఒక్క రూపాయికి అతడు రికార్డులు నిర్వహించలేదు. పెట్టుబడిగా వచ్చిన డబ్బును బకాయిదారులకు చెల్లించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో అద్విక బోర్డు ఏర్పాటు చేసుకుని ఇద్దరు కార్యాలయాలు నిర్వహించారు. వారిలో ఒకరు రూ.25 కోట్లు పెట్టగా, మరొకరు రూ.50 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టించాడు. ఇందులో ఒక వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఇద్దరితో ఆదిత్య చేసిన చాటింగ్‌ను పోలీసులు చదివారు. పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తున్నారని, వారిలో కొంతమంది రాజకీయ నేతలతో ఒత్తిడి చేయిస్తున్నారని చాటింగ్ చేశాడు. త్వరలో భారీ మొత్తంలో ఒక పెట్టుబడి వస్తుందని, అది రాగానే అందులో నుంచి ఆ అకౌంట్లను సెటిల్ చేద్దామని ఆదిత్య సమాధానం ఇచ్చాడు. దీన్నిబట్టి ఆదిత్య ఎక్కడా రికార్డులు నిర్వహించలేదని గుర్తించారు. మరోపక్క గోల్డెన్ లీఫ్ నకిలీ వెబ్‌సైట్‌ను జనం నుంచి డబ్బు వసూలు చేయడానికి విరివిగా ఉపయోగించుకున్నాడు. అద్వికకు సలహాదారులుగా ఉన్న కీర్తి, ఆమె భర్త నరసింహారావు సింగపూర్‌లో ఫారెన్ ఎక్స్ఛేంజ్ విభాగంలో పనిచేశారు. అద్వికలో ఈ గోల్డెన్ లీఫ్‌ను కీర్తి నిర్వహించింది. అద్వికలో పెట్టుబడులు పెట్టిన వారికి ఇందులో ఖాతాలు సృష్టించారు. ఇందులో కీర్తి 40 శాతం వాటా పెట్టినట్టు చూపించారు.

**మళ్లీ వస్తా.. రెట్టింపు వ్యాపారం చేద్దాం**

పోలీసుల అదుపులో ఉన్న ఆదిత్యను కొంతమంది ఏజెంట్లు కలుస్తున్నారు. ఇదంతా విచారణ సమయంలో జరుగుతోంది. ఆ సమయంలో ఆదిత్య వారితో కీలక వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈ విచారణ మొత్తం ఈఎస్ఐ రోడ్డులో ఉన్న అద్విక ట్రేడింగ్ కంపెనీలో జరుగుతోంది. పోలీసులు అరెస్టు చేసి, కేసు పెట్టి జైలుకు పంపినా మళ్లీ బయటకు వస్తానని చెబుతున్నట్టు తెలియవచ్చింది. తర్వాత వ్యాపారాన్ని మరింత రెట్టింపు స్థాయిలో పరుగులు తీయిస్తానని భరోసా ఇస్తున్నట్టు సమాచారం. ఎవరెవరికి బకాయి ఉన్నామో ఆ ప్రతి రూపాయిని తిరిగి చెల్లిస్తానని అభయం ఇస్తున్నాడు. దీనికి ఆరేడు నెలల సమయం పడుతుందని చెబుతున్నట్టు తెలియవచ్చింది.

ఫ్లాట్‌ను విక్రయించిన యజమానికి ఝలక్

ఆదిత్య పెనమలూరు మండలం తాడిగడపలో రూ.2 కోట్లతో ఒక ఇంటిని నిర్మించాడు. ఇది పూర్తయ్యాక రూ.2.50 కోట్లతో ఆదిత్య, కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న కిరణ్‌కుమార్ కలిసి ఎన్టీఆర్ కాలనీలో ఉన్న ఫిలిం కాలనీలో రెండు ఫ్లాట్లు కొన్నారు. అడ్వాన్స్‌గా బిల్డర్‌కు ఇచ్చిన డబ్బును తిరిగి అద్వికలో పెట్టుబడిగా పెట్టించారు. కొంతకాలంగా చెల్లింపులు ఆగిపోవడంతో బిల్డర్ తిరుగుబాటు చేశాడు. ఆదిత్యను కూర్చోబెట్టి ఆ ఫ్లాట్‌ను తన పేరు మీద బిల్డర్ రాయించుకున్నాడు. ఇదికాకుండా తాడేపల్లిలో రూ.కోటి విలువైన రెండు, మూడు ఫ్లాట్లను బుక్ చేశాడు. వాటికి అడ్వాన్స్‌లు ఇచ్చి ఆ డబ్బును పెట్టుబడిగా తీసుకున్నాడు.

# పాఠశాలను తరలించొద్దంటూ ధర్నా



పొందూరు,(సందేశం టైమ్స్, జులై 1): తమ పాఠశాలలో 3, 4, 5 తరగతులను వేరే పాఠశాలకు తరలించొద్దంటూ నందివాడ పంచాయతీ భగవాన్‌దాస్‌పేట పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంతో భగవాన్‌దాస్‌పేట పాఠశాలలో 3, 4, 5 తరగతులను నరసాపురం ఆదర్శ ప్రా?థమిక పాఠశాలల్లో విలీనం చేశారు. తరగతులను తరలించొద్దంటూ గతంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకు వినతిపత్రం అందించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో హెచ్ఎం రమేష్ పాఠశాలలో ఉండగా తమ పిల్లలతో తల్లిదండ్రులు నినాదాలు చేస్తూ పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు.

# 2,500 ఎకరాలకు సాగునీరందేనా?

టెక్కలి సమీపంలో కాలువ నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తున్న వంశధార, పోర్టు అధికారులు(ఫైల్)

**పోర్టురోడ్డు నిర్మాణంతో వంశధార కాలువలు కప్పేశారు**

**ఆందోళనలో 20 గ్రామాల రైతులు**



టెక్కలి, (సందేశం టైమ్స్, జులై 1): పోర్టు రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రైతులకు సాగునీటి ముప్పు ఎదురవుతోంది. సంతబొమ్మాళి మండలం మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు కోసం నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మదనగోపాలసాగరం నుంచి మూలపేట వరకు 13.6 కిలోమీటర్లు.. వందమీటర్ల వెడల్పుతో విస్తరణ పనులు చేపడుతున్నారు. టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లోని 20 గ్రామాల్లో కాలువలు, చెరువులు కప్పేస్తున్నారు. వంశధార పరిధిలో 50ఏఆర్, 50ఆర్, 49ఆర్, 48ఆర్ కాలువల పైనుంచి రోడ్లు వేస్తున్నారు. దీంతో తమకు సాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పోర్టు రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న మారిటైం బోర్డు సివిల్ ఇంజనీర్లు, విశ్వసముద్ర సంస్థ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా సుమారు 2,500 ఎకరాలకు సాగునీరు అందుతుందో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఈ ఏడాది జనవరి 9న వంశధార ప్రధాన ఎడమకాలువ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శేఖరరావు, డీఈఈలు సుధాకర్, నవీన్, మారిటైం బోర్డు సివిల్ ఇంజనీర్లు, విశ్వసముద్ర ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పోర్టు రోడ్డును పరిశీలించారు. వంశధార అధికారులు ప్రస్తుతం ఉన్న 30 కాలువలతో పాటు అదనంగా మరో 20 కాలువలు అవసరమని గుర్తించారు. వీటికి సంబంధించి సుమారు రూ.8కోట్లతో ప్రతిపాదనలను పోర్టు యంత్రాంగం ముందుంచారు. దీనిపై పోర్టు యంత్రాంగం అభ్యంతరం వ్యక్తం చేయడంతో స్థానిక వంశధార ఈఈ.. సాగునీటి కాలువల కల్వర్టుల నిర్మాణ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాగా పోర్టు యంత్రాంగమే ఈ పనులు జరిపిస్తే రైతులకు సమస్యలు ఉండవని అధికారులు భావించినట్లు తెలుస్తోంది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పోర్టు అధికారులు అక్కడక్కడా పైపులైన్లు పెట్టాలనే ఆలోచనలో ఉన్నారు. వంశధార అధికారులు మాత్రం బాక్సు కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు. విష్ణుచక్రం, కస్పానౌపడా, కూర్మన్నపాలెం, ఆర్అండ్ఆర్ కాలనీ, నౌపడా ఆర్ఎస్, ఇజ్జువరం, తలగాం, బిర్లంగిపేట, వేములవాడ, బన్నువాడ, మోదుగువలస, అయోధ్యపురం, పితాపురం, టెక్కలి ప్రాంతాల్లో బాక్సు కల్వర్టులు అవసరమని తెలిపారు. దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న వేళ జూలై 2న వంశధార ప్రధాన ఎడమకాలువ వెంబడి సాగునీరు విడిచిపెట్టనున్నారు. కాగా ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులతో కప్పబడిన కాలువల ద్వారా చెరువులు ఎలా నిండుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం మధ్యాహ్నం టెక్కలిలో పర్యటించనున్నారు. పోర్టు రహదారుల నిర్మాణంలో భాగంగా పక్కనున్న భూములకు సాగునీటి సమస్యను గుర్తించేందుకు ఆయా గ్రామాల రైతులతో కలిసి పరిశీలించనున్నారని టీడీపీ నాయకులు తెలిపారు.

# అక్కడ వైద్యం 'దూరం'



విజయనగరం (సందేశం టైమ్స్, జులై 1): చర్మవ్యాధితో బాధపడుతున్న గంట్యాడ మండలానికి చెందిన కృష్ణ రెండు రోజులు క్రితం చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆశ్రయించాడు. అక్కడ ఓపీ తీసుకున్న తరువాత చర్మవ్యాధులను పరీక్షించే గదికి వెళ్లాడు. అక్కడ ఉన్న ఓ డాక్టరు(అసిస్టెంట్ ప్రొఫెసర్) కృష్ణను పరీక్షించే తీరు చాలా విచిత్రంగా కన్పించింది. కృష్ణను రెండు మీటర్ల దూరంలో ఉంచి సమస్య అడిగి అక్కడి నుంచే టార్చిలైటు వెలుగులో పరీక్షించారు. ఆపై ఎదురుగా కూర్చున్న ముగ్గురు సిబ్బందితో మందులు రాయించి కృష్ణను పంపించేశారు. కృష్ణకు తన సమస్యను పూర్తిస్థాయిలో చెప్పుకునే అవకాశం లేకుండా పోయింది. దీనిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విభాగానికి వచ్చే రోగులందరికీ నిత్యం ఇదే సమస్య ఎదురవుతోంది. తమ సమస్యను వివరంగా చెప్పుకునే అవకాశం లేకుండా దూరం నుంచే వైద్యులు చూసి అంచనా వేస్తున్నారు. వైద్యుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చర్మవ్యాధికి సంబంధించి సమస్యలుంటే రోగులను దగ్గరగా చూసి పరిశీలిస్తేనే ఆ వ్యాధి ఏమిటన్నది స్పష్టంగా తెలుస్తుందని చర్మవ్యాధుల వైద్యుడొకరు తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆ పరిస్థితి లేదు. దూరం నుంచి పరిశీలించి తూతూమంత్రంగా చికిత్స చేయడంతో సమస్యలు తగ్గడం లేదని రోగులు పెదవి విరుస్తున్నారు. ఈ పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నామంటున్నారు. కొంతమంది సిబ్బంది కూడా రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తే ఇక్కడ వైద్యుల తీరు బాగోలేదని మరో బాధితుడు వాపోయాడు.- గత నెలలో ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో జిల్లాకేంద్ర ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నా, ఆధునిక పరికరాలు ఉన్నా రోగులను పూర్తిస్థాయిలో పరీక్షించకుండా కేజీహెచ్‌కు పంపిస్తున్నారంటూ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రస్తావించారు. ఆయన మాటలకు మద్దతుగా వైద్యులు, సిబ్బంది తీరు కనిపిస్తోంది. ఇదే విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా రోగుల పట్ల వైద్యులు అలా ఉండకూడదని, దీనిని పరిశీలించి మాట్లాడుతానన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయాలంటే ఆసుపత్రిలో ఫిర్యాదుల బాక్సు ఉందని, అందులో ఫిర్యాదు కాపీ వేయవచ్చునని వెల్లడించారు.

# హెల్త్ క్లినిక్ ప్రారంభం ఎప్పుడో..?



గాండ్లపెంట, (సందేశం టైమ్స్, జులై 1): మండలపరిధిలోని సోమ యాజులపల్లిలో విలేజీ హెల్త్ క్లినిక్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో అని ఆ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. గ్రామీణులకు వై ద్యం అందించే లక్ష్యంతో గత ప్రభుత్వంలో దీనిని నిర్మించారు. దీని నిర్మాణానికి అప్పట్లో రూ. 23లక్షల నిధులు కేటాయించారు. దీంతో నిర్మాణం పూర్తి అయి యేడాది అవుతోంది. అయితే కాంట్రాక్టర్‌కు ఇంకా 20శాతం బిల్లులు రావాల్సిఉందని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు అంటున్నారు. యేడాదిక్రితమే భవనం పూర్తి అయినా బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ తాళాలు ఇవ్వలేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు. దీంతో గ్రామ సచివాలయంలోని ఓ భవ నంలో అసౌకర్యాల నడుమ చికిత్సలు అందిస్తున్నారు. ఈ గ్రామ సచివాలయం పరిధిలో 13గ్రామాలు ఉన్నాయి. వీరికి వైద్యం అందించాలంటే సిబ్బంది ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నా రు. ఇప్పటికైనా అ?ధికారులు, ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టుకు రావాల్సిన బిల్లులు అందించి, నిర్మాణం పూర్తయిన హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ జేఈ రెడ్డివరప్రసాద్‌ను వివరణ కోరగా... కాంట్రాక్టర్‌కు కొద్దిగా బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. ఆ బిల్లులు వస్తే తాళాలు ఇస్తానని కాంట్రాక్టర్ చెప్పాడని జేఈ తెలిపారు.

# స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించాలి

పీసీపల్లి,(సందేశం టైమ్స్, జులై 1): స్వచ్ఛ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర బృందం సభ్యులు జి.సుధీర్, ఎమ్.ప్రశాంత్‌లు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు మండలంలోని పెదఅలవలపాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భం గా 20 గృహాలను పరిశీలించారు. ఆయా గృహాల్లో మరుగుదొడ్లు ఉన్నాయా, లేవా, సొంతంగా ఇంటిని నిర్మించుకున్నారా, ప్రభుత్వ నిధులతో నిర్మించుకున్నా రా? అని గృహ యజమానులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం ఎలా ఉందంటూ ప్రజలను అడిగి



తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలలోని మరు గుదొడ్లను పరిశీలించారు. వాటి వినియోగం, పారిశుధ్య నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పా రిశుధ్య నిర్వహణ, స్వచ్ఛభారత్‌పై అవగాహన, పారి శుధ్య పనుల గురించి సర్వే నిర్వహించిన బృందం వాటి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం సభ్యులు చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన సమా వేశంలో వారు మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్తను సేకరించి చెత్తసంపద కేంద్రానికి తరలించి కంపోస్టు ఎరువును తయారు చేయించాలని చెప్పారు. కంపో స్టు ఎరువులు తయారుచేసి విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. కా ర్యక్రమంలో ఎంపీడీవో హను మంతరావు, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ పవన్‌కుమార్, స్వ చ్ఛభారత్ కన్సల్టెంట్ ఖాజా వలి, జి.సురేష్‌బాబు, పంచా యతీ కార్యదర్శులు, ఇంజనీ రింగ్ అసిస్టెంట్‌లు, తదితరు లు పాల్గొన్నారు.

# తల్లికి వందనం పెండింగ్ ఈకేవైసీని నేటితో పూర్తిచేయాలి



ఒంగోలు (సందేశం టైమ్స్, జులై 1) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న తల్లికివందనంలో భాగంగా పెండింగ్ ఈకేవైసీని మంగళవారం సాయంత్రంలోపు పూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలతో సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. అర్హులందరికీ ఈ పథకం కింద ప్రయోజనం దక్కడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈకేవైసీ పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని చెప్పారు. ఈనెల 5వ తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. పీ-4పథకంలో భాగంగా బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించాలని, అదే సమయంలో వీటికి అండగా నిలిచేలా మార్గదర్శకులను కూడా గుర్తించాలని చెప్పారు. ఫారంపాండ్స్, ఫిషింగ్ పాండ్స్, కంపోస్టు పిట్స్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జూలై 8న రాష్ట్ర వ్యాప్తంగా పదివేల ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, అందులో భాగంగా జిల్లాలో 750 ఎకరాలలో మొక్కలు నాటాలని చెప్పారు. ఆ రోజున ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్రసాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జూలైలో ఉపాధి పథకం కింద 20 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సగటు వేతనం రూ.251 లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అదికారులు చిరంజీవి, జోస్‌ఫకుమార్, శ్రీనివాసప్రసాద్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు



కనిగిరి, (సందేశం టైమ్స్, జులై 1): ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు ఎమ్మె ల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం కనిగిరిలోని ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆసుపత్రిలోని వార్డులన్నీ కలియతిరి గారు. కంగారు మదర్ కేంద్రాన్ని పరిశీలించారు. స్కానింగ్ గదులు, ఆపరేషన్ గదులను పరిశీలించా రు. మదర్‌కేర్ వార్డులోని బాలింతలను ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై విచారించారు. ఆసుపత్రి లోని సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్య సేవల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా.. ఆసుపత్రిలో వైద్యులు సకా లంలో పరీక్షలు చేస్తున్నారా.. వైద్య సిబ్బంది ఎలా నడుచుకుంటున్నారు? అని రోగులను అడిగి తెలుసు కున్నారు. ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని బాలింతలు, వారి బందువులను అడిగారు. ఎలాంటి ఇబ్బందులు లేవని వైద్యసేవలు బాగున్నాయని ఎమ్మెల్యేకు చెప్పారు. అనంతరం దాదాపు రూ.ఒక కోటితో ఆసుపత్రి పైఅంతస్థులో నిర్మిస్తున్న నూతన డయాలసిస్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమా ణాలు పాటించాలని ఇంజనీర్‌కు సూచించారు. భవిష్య త్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మించాలని కోరారు. క్యూరింగ్ కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. మెటీరియల్‌లో నాసిరకం వాడినట్లు తెలిస్తే ఉపే క్షించేది లేదన్నారు. ఎమ్మెల్యే వెంట డయాలసిస్ నూ తన భవన నిర్మాణ ఇంజనీర్లు, సిబ్బంది, అధికారులు ఉన్నారు.

# మరిడమ్మ జాతరలో అశ్లీల నృత్యాలు

- ♦ జాతరలో అశ్లీల నృత్యాల ప్రదర్శన
- ♦ మద్యం మత్తులో విచక్షణఎ
- ♦ కోల్పోయి కొట్టుకున్న యువకులు
- ♦ భయభ్రాంతులకు గురైన ప్రజలు
- ♦ నియంత్రించలేకపోయిన పోలీసులు



పెద్దాపురం, (సందేశం టైమ్స్, జులై 1): భక్తిభావం ఉప్పొంగాల్సిన జాతరలో అశ్లీల నృత్యాలు హోరెత్తాయి. వాటిని అడ్డుకోవాల్సిన పోలీసులు చోద్యం చూశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో మరిడమ్మ జాతర సంద ర్భంగా స్థానిక చాపలవీధి సంబరం కార్యక్రమం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక దర్గా సెంటర్ ప్రాంతంలో భారీ స్టేజీ నిర్మి ంచి యువతులతో అశ్లీల నృత్యాల ప్రదర్శన నిర్వహించారు. భారీ డీజే సాంగ్స్‌తో హోరెత్తించారు. దీంతో పెద్ద సంఖ్యలో జనం అక్కడకు చే రారు. మద్యం తాగిన పలువురు యువకులు మ త్తులో జోగుతూ ఘర్షణలకు దిగారు. పరస్పరం ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా రాళ్లతో దాడి చేసుకున్నారు. సమీపంలో మద్యం దుకాణం ఉండడంతో పరిస్థితి మరీ భయానకంగా మారింది. అక్కడి వాతవరణం చూసి సంబరాన్ని తిలకించడానికి వచ్చిన ప్రజలు, మహిళలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ పరస్పర దాడుల్లో గాయపడిన యువకులను స్థానిక ఆసుపత్రికి తరలిస్తే అక్కడ సైతం వారు మత్తు లో ఘర్షణకు దిగి ఆసుపత్రిలో భయానక వాత వరణం సృష్టించారు. అశ్లీల నృత్యాల నిర్వహణకు స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లే కారణమని, అందుకే పోలీసులు వారికి తలొగ్గి అశ్లీల నృత్యాలు నియంత్రించకుండా అక్కడ ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారని పలువురు చర్చి ంచుకుంటున్నారు. దీనిపై వి చార ణ చేసి సంబంధిత వ్య క్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# శ్రీశైలం మండలాన్ని మార్కాపురం డివిజన్‌లో విలీనం చేయాలి

మార్కాపురం (సందేశం టైమ్స్, జులై 1): నంద్యాల జిల్లాలోని శ్రీశైలం మండలాన్ని మార్కాపురం డివిజన్‌లో విలీనం చేయాలని టీడీపీ పోల్ మేనేజిమెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, పాస్ సంస్థ నాయకులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన ఎన్నికల వాగ్దానం మేరకు నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా మార్కాపురం జిల్లాగా చేయనున్నారని తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు, ప్రజల ఆకాంక్షలు రోజువారీ అవసరాల కోసం నంద్యాల జిల్లా ఆత్మకూరు డీఎఫవో పరిధిలో ఉన్న శ్రీశైలం, సున్నిపెంట, ఫారెస్ట్ బీట్‌లను మార్కాపురం డీఎఫ్‌వో కార్యాలయంలో విలీనం చేయాలన్నారు. రోళ్లపెంట నుంచి శ్రీశైలం శిఖరం వరకు ఉన్న అటవీ ప్రాంతం మార్కాపురం డీఎఫవో పరిధిలో ఉందని, మిగిలిన కొంత ప్రాంతం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉండిపోయిందని తెలిపారు. మార్కాపురానికి 80కి.మీ. దూరంలో ఉన్న శ్రీశైలంకు అనేక రకాల సంబంధాలు విద్యా, వైద్యం, పండ్లు, కూరగాయాలు, నిత్యావసర వస్తువులు ఇంకా అనేక వ్యాపారాలు ఇక్కడ నుంచే జరుగుతుంటాయని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలు కూడా ముడిపడి ఉన్నాయన్నారు. జల వనరులకు సంబంధించి వివాధాలు తలెత్తకుండా వెలిగొండ ప్రాజెక్టు



ఆయకట్టు రైతుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం మండలాన్ని కొల్లం వాగు పరిసరాలను మార్కాపురం డివిజన్‌లో కలిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ సంస్థ అధ్యక్షులు గాయం వెంకట నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, బొగ్గు శేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, చలువాది వెంకటేశ్వర్లు, జంకె వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# ప్లీనరీని జయప్రదం చేయండి



రాయచోటిటౌన,(సందేశం టైమ్స్, జులై 1):విద్యారంగ సమస్యలపై ఈ నెల 23, 24వ తేదీల్లో కడపలో జరగనున్న రెవల్యూషనరీ స్టూడెంట్ ఫోరం (ఆర్‌ఎసఎఫ్) రాష్ట్ర స్థాయి ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు, కార్పొరేట్ పాఠలశాలల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలకు, జూనియర్ కాలేజీలు, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలకు నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎసఎఫ్ నాయకులు అష్రఫ్, బాదుల్లా, కల్యాన, ఫైజాన, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమ్మెపై నోటీసు అందజేత

రాజంపేట, (సందేశం టైమ్స్, జులై 1): కార్మికుల సమస్యలపై ఈనెల 9న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాజంపేట మున్సిపల్ క మిషనర్ శ్రీనివాసులు, తహసీల్దారు పీరుమున్నీలకు ముందస్తు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేటీకరణను రద్దు చేయాలని, లేబర్‌కోడ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన నాయకులు రమణ, లక్ష్మీదేవి,



ప్రసాద్, తహసీల్దారు ఆఫీసు వద్ద వీఆర్‌ఏ సంఘం నాయకులు శంకర్, సుబ్రమణ్యం, రమణయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

# తెరచుకున్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు



ముదోల్ :(సందేశం టైమ్స్, జులై 1): దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర సర్కారు.. రెండు రాష్ట్రాల నీటిపారుదల, సీడబ్ల్యూసీ, బాబ్లీ బంధారా కృతి సమితి సభ్యుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తింది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టులో 1,064 అడుగుల వద్ద 15,567 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.బాబ్లీ గేట్లు తెరచుకోవడంతో దిగువన ఉన్న రైతులు, మత్స్యకారులు హర్షం వ్యక్తంచేశారు. గోదావరి నదికి నీటి ప్రవాహం సాయంత్రం వరకు పెరగనున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు, జాలర్లు, అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పవన్ చంద్ర, ఎస్సై శ్రీనివాస్ ఉమ్మడి ప్రకటనలో తెలిపారు.

# సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి సారించండి :
## ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ



కొత్తగూడెం (సందేశం టైమ్స్, జులై 1):సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి సారించాలని ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ అన్నారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సెక్షన్‌లో రికార్డులను పరిశీలించిన ఆయన పలు అంశాలను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు, మంచినీరు సరఫరా చేసే బోర్లు ఎన్ని ఉన్నాయి, ఎన్నిరోజులకొకసారి ప్రజలకు నీటిని అందిస్తున్నారు, ఫిల్టర్ బెడ్ ఎక్కడ ఉంది, ఎన్ని ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నాయి, ఎన్ని రోజులకొకసారి ట్యాంక్‌లను శుభ్రం చేస్తారు, మంచినీటి పైప్ లైన్ వ్యవస్థ పనితీరు, ఎంతమంది ఇంజినీరింగ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలకు, బోర్లకు ఎంత కరెంట్ బిల్ చెల్లిస్తున్నారని అడుగగా డీఈ రవికుమార్ సుమారు రూ.7 నుండి రూ.10 లక్షలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. దీంతో సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తే కరెంట్ బిల్ నుండి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. తద్వారా మున్సిపల్ కార్పొరేషన్ విద్యుత్ సంస్థకు చెల్లించే బిల్లు నుండి ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సోలార్ వినియోగిస్తే సుమారు రూ.5 లక్షలే అవుతాయని, రూ.5 లక్షలు ఆదా అవుతాయని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ పనితీరును అడిగి తెలుసుకుని, ఎస్‌టీపీ (సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) లపై ఆరా తీశారు. సుజాతనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నీటి సౌకర్యం లేదని ఉపాధ్యాయులు తన పర్యటనలో దృష్టికి తీసుకువచ్చారని సమస్యను పరిష్కరించాలని సూచించారు.

# మొబైల్ షాపుకు కన్నం వేసి
# 5 లక్షల విలువైన ఫోన్లు చోరీ..




హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 1): నగరంలో భారీ చోరీ జరిగింది. ఓ దొంగ మొబైల్ షాపు గోడకు కన్నం వేశాడు. మొబైల్ షాపులోకి ప్రవేశించి రూ.5లక్షల విలువైన ఫోన్లను దోచుకెళ్లిపోయాడు. మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దొంగతనం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఆదివారం అర్ధరాత్రి ఓ దొంగ దిల్‌సుఖ్‌నగర్-కోఠి మెయిన్ రోడ్డులో ఉన్న బిగ్ సీ షో రూమ్ దగ్గరకు వచ్చాడు. మెట్ల వైపు ఉన్న గోడకు ఉలి, సుత్తెతో భారీ కన్నం వేసి దాని గుండా షోరూములోకి ప్రవేశించాడు.అనంతరం విలువైన ఫోన్లను దోచుకెళ్లాడు. ఆ దొంగ రూ.5లక్షల విలువ చేసే ఫోన్లను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దొంగను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. షో రూములో ఉన్న సీసీటీవీ ఫుటేజీల్లో దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఆ దొంగ తనను ఎవ్వరూ గుర్తు పట్టకుండా ఉండటానికి ముఖానికి ఎర్రటి వస్త్రం కట్టుకుని దొంగతనం చేశాడు.కాగా, అచ్చం ఇలాంటి సంఘటనే మే నెలలో బెంగళూరులో చోటుచేసుకుంది. ఓ వ్యక్తి గోడకు కన్నం వేసి మొబైల్ షాపును దోచేశాడు. అసోంకు చెందిన ఇక్రామ్? ఉల్ హసన్? కొన్ని నెలల క్రితం బెంగళూరుకు వచ్చాడు. అతడు అరెకెరెలో నివాసం ఉండేవాడు. ముందుగా సెంట్రల్ మాల్?లో పనిచేశాడు. అక్కడ పని మానేసి డొమినోస్ పిజ్జా షాపులో చేరాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనం చేయాలని భావించాడు. ఈ క్రమంలోనే బొమ్మనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్? టెలికాం మొబైల్ షాపులో దొంగతనం చేశాడు. 85 ఫోన్లు దోచేశాడు.

# ఇందిరమ్మ ఇండ్లకు ధరల భారం..
## అదనంగా రూ.4లక్షల వరకు ఖర్చు !



ఇబ్రహీంపట్నం, (సందేశం టైమ్స్, జులై 1): ఎరిగిన స్టీల్, సిమెంట్, ఇసుక, కంకర ధరలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ దారులపై భారం పడుతోంది. ఇళ్ల నిర్మాణాలు గాడిన పడుతున్న తరుణంలోనే సామాగ్రి రేట్లు అధికం కావటం ప్రతిబంధకంగా మారింది. వీటికి తోడు కంకర, కూలి ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. పెరిగిన ధరలను బట్టి ఒక్కో ఇంటిపై రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు అదనపు భారం పడేలా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. నిన్న మొన్నటి వరకు అంతంతమాత్రంగా ఉన్న ధరలుప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటంలో ఒక్కసారిగా ధరలు పెరిగిపోయి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తున్నాయి.

# గుర్తించలేని స్థితిలో పాశామైలారం మృతులు..
## డీఎన్ఏ పరీక్షలకు ఏర్పాట్లు



హైదరాబాద్ :(సందేశం టైమ్స్, జులై 1): పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 45కు పెరిగింది. వారిలో కొందరి మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాంతో డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, శిథిలాల కింద మరో 27 మంది ఉన్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు.కాగా ప్రమాద స్థలాన్ని మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్, మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు కూడా సీఎం వెంట ఉన్నారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం చెప్పారు. మృతులకు ఫార్మా కంపెనీ రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని అన్నారు.

# ఆయిల్‌పామ్ పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం

కొత్తకోట,(సందేశం టైమ్స్, జులై 1): ఆయిల్ పామ్ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలో రైతు తిరుపతి తన వ్యవసాయ పొ లంలో పామాయిల్ మొక్కల నాటారు. ఈ సం దర్భంగా ఉద్యన శాఖ అధికారులు రైతులతో స మావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెట్ట భూముల కు బోరు మోటారు ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు ఏమి ఆలోచించకుండా వాణిజ్య పంట ల్లో అధిక లాభాలు వచ్చే ఆయిల్ పామ్ సాగు పై దృష్టి పెట్టాలన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు చేసుకునే రైతులు వ్యవసాయ అధికారు లను సంప్రందిస్తే రాయితీతో మొక్కలు, డ్రిప్ సిస్టం పైపులు, పరికరాలు, ఎరువులు ఇవ్వను న్నట్లు చెప్పారు. అంతకు ముందు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంతో రూ. 33.5 లక్షలతో నిర్మిస్తున్న ల్యాబ్, లైబ్రరి భవనా లకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, ఎంఈవో కృష్ణయ్య, మనిసిపల్ కమి షనర్ సైద య్య, ఏవో జాస్మిన్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయోజ్, బీచుపల్లి యాదవ్ తదిత రులు పాల్గొన్నారు.

# వైద్యులు కనిపించే దేవుళ్ళు..
## కోటగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్



బాన్సువాడ (సందేశం టైమ్స్, జులై 1): వైద్యో నారాయణో హరి.. అంటే వైద్యుడు దేవుడితో సమానమని, వైద్యుడు అంటే కనిపించే దేవుడని కోటగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా కోటగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యురాలు సుప్రియను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు పత్తి లక్ష్మణ్ మాట్లాడుతూ.. వైద్యవృత్తి చాలా పవిత్రమైనదని కొనియాడారు. ఆ సర్కారు దవాఖానలో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి గోగినేని హనుమంతరావు, ఉపాధ్యక్షులు పీ అనిల్ కుమార్, పోలా అశ్విన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ నిశాంత్, జానకిరావు, కూచి సిద్ధయ్య, తరుణ్ సాయి తేజ, పీ సతీష్, ఉదయ్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి:

మణికొండ,(సందేశం టైమ్స్, జులై 1):విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు విధిగా తీసుకొని ముందుకు సాగాలని సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఇబ్రహీంబాద్ విద్యుత్ డివిజన్ పరిధిలోని నిక్నాపూర్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లైన్ క్లియర్ పొందిన తర్వాతనే పని చేయాలన్నారు. హెల్మెట్, సేఫ్టీ బెల్ట్ పెట్టుకుని పని చేయాలని సూచించారు. ప్రాణాలు కాపాడటంలో ఎర్తింగ్ అతి ముఖ్యమైనది. కనుక పని ప్రారంభించే ముందు ఎర్తింగ్ తప్పకుండా వాడాలన్నారు.



# క్రీడావార్తలు



# మెద్వెదెవ్ అవుట్



లండన్: వింబుల్డన్ తొలిరోజే సంచలనాలు చోటు చేసుకున్నాయి. ఎనిమిదో సీడ్ హెూల్గర్ రూన్, తొమ్మిదో సీడ్ డానిల్ మెద్వెదెవ్‌కు మొదటి రౌండ్‌లోనే చుక్కెదురైంది. ఇక..మూడో టైటిల్ వేటలో ఉన్న అల్కారజ్ ఆరంభ మ్యాచ్‌లో ఐదు సెట్లు పోరాడాల్సి వచ్చింది. మహిళల టాప్ సీడ్ సబలెంకా, లోకల్ ఫేవరెట్ ఎమ్మా రదుకాను శుభారంభం చేయగా, ఆరో సీడ్ మాడిసన్ కీస్ మూడు సెట్లు శ్రమించాల్సి వచ్చింది. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో చిలికీ చెందిన క్వాలిఫయర్ నికొలాస్ జారీ ఐదు సెట్ల పోరాటంలో 4-6, 4-6, 7-5, 6-3, 6-4తో రూన్‌ను చిత్తు చేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన 64వ ర్యాంకర్ బెంజమిన్ బోంజి 7-6 (2), 3-6, 7-6 (3), 6-2తో 2021 యూఎస్ ఓపెన్ విజేత మెద్వెదెవ్ (రష్యా)పై సంచలన విజయం సాధించాడు. ఇటీవల జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మెద్వెదెవ్ ఆరంభ రౌండ్‌లోనే వెనుదిరిగాడు. ఇక.. 20వ సీడ్ పాపిరిన్ 4-6, 1-6, 6-4, 4-6తో ఆర్థర్ ఫెర్రీ చేతిలో ఓటమి పాలయ్యాడు. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్‌కు ఇటలీ ఆటగాడు ఫాబియో ఫోనిని గట్టి ప్రతిఘటన ఇచ్చాడు. దాంతో అల్కారజ్ 7-5, 6-7 (7), 7-5, 2-6, 6-1తో గట్టెక్కాడు. 12వ సీడ్ టియఫో 6-3, 6-4, 6-2తో మోలెర్‌ని ఓడించి ముందంజ వేశాడు. మహిళల సింగిల్స్‌లో సబలెంకా 6-1, 7-5తో బ్రాన్‌స్టిన్‌పై సులువుగా నెగ్గగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కీస్ 6-7 (7), 7-5, 7-5తో గాబ్రియెలాపై పోరాడి గెలిచింది.

# ప్లేయింగ్ ఎలెవన్‌తో షాక్ ఇచ్చిన ఇంగ్లండ్.. ఇలా చేశారేంటి?

లీడ్స్ టెస్ట్‌లో విజయంతో ఫుల్ ఖుషీగా ఉంది ఇంగ్లండ్. టీమిండియాను 5 వికెట్ల తేడాతో ఓడించడంతో స్టోక్స్ సేన కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది. ఇదే జోరులో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో కూడా గెలుపుబావుటా ఎగురవేయాలని చూస్తోంది ఆతిథ్య జట్టు. ఈ క్రమంలోనే ప్లేయింగ్ ఎలెవన్‌ను కూడా ప్రకటించింది. అయితే అనూహ్యంగా ఓ స్టార్ పేసర్‌ను పక్కనబెట్టేసింది. అతడ్ని తీసుకుంటారంటూ బాగా ప్రచారం జరిగినా తుది జట్టులో మాత్రం అవకాశం కల్పించలేదు. అతడు ఎవరనేది ఇప్పుడు చూద్దాం.. తొలి టెస్టులో ఆడిన జట్టునే ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌కూ యథావిధిగా కొనసాగించింది ఇంగ్లండ్. ఓపెనర్లుగా జాక్ క్రాలే, బెన్ డకెట్ బరిలోకి దిగుతారు. ఆ తర్వాత ఓలీ పోప్, జో రూట్ ఆడతారు. హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్, జేమీ స్మిత్ మిడిలార్డర్ బాధ్యతలు పంచుకుంటారు. క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ పేస్ బాధ్యతలు తీసుకుంటారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా షోయబ్ బషీర్ బరిలోకి దిగుతాడు. అయితే




అంతా బాగానే ఉన్నా పేస్ సెన్సేషన్ జోఫ్రా ఆర్చర్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. కౌంటీల్లో అదరగొట్టిన ఆర్చర్.. ఫామ్, ఫిట్‌నెస్ రెండూ నిరూపించుకున్నాడు. దీంతో అతడ్ని స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. కానీ ఈ మ్యాచ్ ప్లేయింగ్ ఎలెవన్‌లో మాత్రం అవకాశం కల్పించలేదు. ఆర్చర్ విషయంలో మరికొంత కాలం వేచి ఉండాలని, పూర్తి ఫిట్‌నెస్ సాధించాకే ఆడించాలనే ఆలోచనల్లో ఇంగ్లండ్ టీమ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది.

# బరిలోకి హర్మన్‌ప్రీత్

బ్రిస్టల్: ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను అదిరే విజయంతో ఆరంభించిన భారత మహిళల జట్టు నేడు (మంగళవారం) రెండో టీ20 ఆడనుంది. తొలి మ్యాచ్‌కి విశ్రాంతి తీసుకున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ రెండో టీ20కి అందుబాటులో ఉండే అవకాశం ఉంది. దీంతో భారత బ్యాటింగ్ విభాగం మరింత పటిష్ఠం కానుంది. ఓపెనర్ స్మృతి మంధాన కెరీర్‌లో తొలి సెంచరీ సాధించడంతో నాటింగ్‌హామ్ మ్యాచ్‌లో భారత్ 97 పరుగుల తేడాతో నెగ్గింది. వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ సత్తా నిరూపించుకుంది. మిడిలార్డర్‌లో జెమీమా, రిచా ఘోష్ నిలకడ చూపాల్సి ఉంది. ఓపెనర్ షఫాలీ సహజశైలిని అందుకుంటే ఇంగ్లండ్‌కు మరోసారి కష్టాలు తప్పవు. ఇక ప్రధాన బౌలర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ లేకపోయినా



బౌలింగ్ విభాగం అదరగొట్టింది. ముఖ్యంగా అరంగేట్రంలోనే తెలుగమ్మాయి శ్రీచరణి నాలుగు వికెట్లతో ఇంగ్లండ్‌ను వణికించింది. వెటరన్ స్పిన్నర్లు రాధా యాదవ్, దీప్తి శర్మ సైతం ప్రభావం చూపారు. కానీ ఆతిథ్య ఇంగ్లండ్ బౌలర్లు, బ్యాటర్లు మాత్రం ప్రభావం చూపలేదు. బ్యాటింగ్‌లో నాట్ సివర్ మాత్రమే క్రీజులో నిలిచినా తనకు సహకారమే కరువైంది. నేటి మ్యాచ్‌లో మాత్రం ఇంగ్లండ్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చి సిరీస్‌లో సమవుజ్జీగా నిలువాలనుకుంటోంది.

# మనసులు గెలుచుకున్న కావ్యా మారన్.. ఒక్క కామెంట్‌తో..!




సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ ఉంటే చాలు.. స్టేడియాల్లో వాలిపోతుంటారు కో-ఓనర్ కావ్యా మారన్. హైదరాబాద్ అనే కాదు.. ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్ ఎక్కడ జరిగినా ఆమె తెగ సందడి చేస్తుంటారు. చప్పట్లు కొడుతూ, ఎగురుతూ, గెంతుతూ ఆరెంజ్ ఆర్మీ ప్లేయర్లను ఆమె ప్రోత్సహిస్తుంటారు. బౌండరీలు, సిక్సులు కొట్టినా.. వికెట్లు తీసినా ఫుల్ ఎంజాయ్ చేస్తుంటారు. అయితే ఈ క్రమంలో ఆమె ఇచ్చే కొన్ని ఎక్స్‌ప్రెషన్స్ సోషల్ మీడియాలో మీమ్ మెటీరియల్‌గా మారి వైరల్ అవుతున్నాయి. దీనిపై తాజాగా స్పందించారు కావ్యా పాప. ఇంతకీ ఆమె ఏమన్నారంటే.. 'సన్‌రైజర్స్ బరిలోకి దిగితే ప్రోత్సహించాల్సిన బాధ్యత నా మీద ఉంటుంది. నేను అదే చేస్తుంటా. ఈ క్రమంలో నేను ఎలా స్పందించినా అది మ్యాచ్‌లో భాగంగానే చూడాలి. హైదరాబాద్‌లో మ్యాచ్ జరిగితే నేను పెద్దగా చేయడానికేమీ ఉండదు. అక్కడ కూర్చొని ఉండటం తప్పితే ఏమీ చేయను. అహ్మదాబాద్, చెన్నై లేదా ఏ ఇతర వేదికల్లో మ్యాచ్ జరిగితే నేను దూరంగా ఎక్కడో బాక్స్‌లో కూర్చుంటా. అయినా కెమెరామెన్ నన్ను వదలడు. ఎలాగోలా కనిపెట్టి కెమెరాలో బంధిస్తాడు. అలా నేను ఎక్కడ ఉన్నా, ఏం చేసినా మీమ్స్ రూపంలో బయటకు వస్తున్నాయి' అని కావ్యా మారన్ చెప్పుకొచ్చింది. సన్‌రైజర్స్ మ్యాచ్ ఉంటే తాను ఎంతో ఉద్వేగానికి గురవుతానని తెలిపింది కావ్యా పాప. జట్టు అంటే తనకు వల్లమాలిన అభిమానమని పేర్కొంది. టీమ్ బాగు కోసం ఏం చేయడానికైనా తాను సిద్ధమని స్పష్టం చేసింది కావ్యా మారన్. జట్టు గెలుపు కోసం అహర్నిషలు శ్రమిస్తామని.. అందుకే సన్‌రైజర్స్ గెలుపోటములు తనను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తాయంటూ ఎమోషనల్ అయిపోయింది కో-ఓనర్. ఈ మాటలు విన్న నెటిజన్స్.. టీమ్ మీద ఇంత ప్రేమ ఉండటం, జట్టుతో ఇంతగా అటాచ్ అవడం గొప్ప విషయమని మెచ్చుకుంటున్నారు.



# ట్రేడ్‌మార్క్‌గా కెప్టెన్ కూల్

న్యూఢిల్లీ: 'కెప్టెన్ కూల్' అంటే క్రికెట్ అభిమానులకు వెంటనే స్ఫురించే పేరు ధోనీ. మైదానంలో ఎంతో ఒత్తిడి ఉన్నా.. ప్రశాంతంగా తనదైన వ్యూహాలను అమలు చేయడం ధోనీ స్టైల్. ఇప్పుడు ఆ 'కెప్టెన్ కూల్'నే మహీ ట్రేడ్ మార్క్‌గా మార్చాడు. క్రీడలకు సంబంధించి ట్రైనింగ్, ఇతరత్రా సౌకర్యాల కింద 'కెప్టెన్ కూల్' పేరును రిజిస్టర్ చేశాడు. ఈ నెల 5న ఇందు కోసం దరఖాస్తు చేసుకోగా.. వెంటనే ఆమోదించారు. ఈ నెల 16న ట్రేడ్ మార్క్ జర్నల్‌లో పబ్లిష్ కావడం విశేషం. అయితే, ప్రభా స్కిల్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంతకంటే ముందే 'కెప్టెన్ కూల్' టైటిల్ కోసం దరఖాస్తు చేసినా.. మార్చుకోవాలని సూచించినట్టు సమాచారం

# బుమ్రా విషయంలో బేఫికర్.. కోచ్ మాటతో ఫ్యాన్స్ ఖుషీ!

ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌కు సర్వం సిద్ధమైంది. జులై 2వ తేదీ నుంచి జరిగే ఈ మ్యాచ్‌లో దుమ్మురేపాలని చూస్తోంది టీమిండియా. లీడ్స్ టెస్ట్‌లో ఎదురైన ఓటమికి ఇక్కడ ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది గిల్ సేన. ఇంగ్లండ్‌ను చావుదెబ్బ తీసి 1-1తో సిరీస్‌ను సమం చేయాలని చూస్తోంది. అందుకోసం బౌలింగ్ లైనప్‌లో భారీ మార్పులు చేస్తోంది. పేసర్లతో పాటు ఈసారి బలమైన స్పిన్నర్లను రంగంలోకి దింపుతోంది. అయితే అంతా బాగానే ఉన్నా




పేసుగుర్రం జస్‌ప్రీత్ బుమ్రాను ఆడిస్తారా? లేదా? అనేది స్పష్టత లేకుండా పోయింది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం ఖాయమని వినిపిస్తోంది. ఈ విషయంపై తేల్చేశాడు భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డొషేట్. అతడేం అన్నాడంటే.. రెండో టెస్టుకు బుమ్రా కచ్చితంగా అందుబాటులో ఉంటాడని ర్యాన్ టెన్ డొషేట్ అన్నాడు. 5 టెస్టుల్లో మూడు మాత్రమే ఆడగలడని, అయితే గత మ్యాచ్ తర్వాత అతడికి కోలుకునేందుకు 8 రోజుల సమయం దొరికిందన్నాడు అసిస్టెంట్ కోచ్. బుమ్రాను బరిలోకి దించాలా? వద్దా? అనేది పరిస్థితులు, వర్క్‌లోడ్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్ణయిస్తామని చెప్పుకొచ్చాడు.

# పసిడికి పంచ్ దూరంలో..



హైదరాబాద్: జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహైన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఇక్కడి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన 51 కిలోల విభాగం సెమీఫైనల్లో నిఖత్ 5-0తో లక్ష్యను చిత్తుచేసి జ్యోతితో తుదిపోరుకు సిద్ధమైంది. 75 కిలోల కేటగిరి సెమీస్‌లో స్నేహను ఓడించిన లవ్లీనా.. ఫైనల్లో లషు యాదవ్‌తో తలపడనుంది. తెలంగాణకు చెందిన మరో ఇద్దరు బాక్సర్లు యషి శర్మ (65 కి), నిహారిక గోనెల్ల (60 కి) సెమీఫైనల్స్‌లో ఓటమి పాలయ్యారు. నిహారికపై ప్రాచి, యషి శర్మపై శశి గెలుపొంది ఫైనల్స్‌కు చేరారు.

# బిజినెస్



## నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. బ్యాంకింగ్‌తో పాటు ఇతర షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో ప్రామాణిక సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 576.77 పాయింట్లు పతనమై 83,482.13 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. చివరికి 452.44 పాయింట్ల నష్టంతో 83,606.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 120.75 పాయిం ట్లు కోల్పోయి 25,517.05 వద్ద నిలిచింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 నష్టాలు చవిచూడగా.. యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతానికి పైగా క్షీణించాయి. బీఎస్‌ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.81 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, బ్యాంకింగ్ అర శాతానికి పైగా నష్టపోయాయి.

## భారీగా తగ్గిన బంగారం ధరలు..




బంగారం అంటే ఇష్టం లేని వాళ్లు ఎవరుంటారు చెప్పండి. మరీ ముఖ్యంగా ఆడవాళ్లకు బంగారం అంటే ప్రాణం. ఎంత ఉన్నా ఇంకా కావాలని అంటారే తప్ప.. నో చెప్పరు. గత నెల ప్రారంభంలో బంగారం ధరలు పసిడి ప్రియులకు చుక్కలు చూపించాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం తగ్గినట్లే తగ్గి మళ్లీ లక్షకు చేరింది. అయితే, జూన్ చివరకు వచ్చే సరికి ధరలు మళ్లీ తగ్గాయి. 24 క్యారెట్ల బంగారం ధర 93 వేలకు పడిపోయింది. పసిడి ప్రియులకు ఊరటనిస్తోంది. భాగ్య నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 89,300 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 93,770 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 73,080 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరలు బాగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 93,610 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 89,150 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 73,000 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

## ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాల విభజన

### 18-21 నెలల్లో పూర్తి.. ఆ తర్వాతమార్కెట్లో లిస్టింగ్
### అపోలో హాస్పిటల్స్ వెల్లడి

: ప్రముఖ హాస్పిటల్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్‌ఈఎల్) తన వ్యాపారాలను పునర్ వ్యవస్థీకరిస్తోంది. ఇందులో భాగంగా అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాలను ఒక ప్రత్యేక కంపెనీగా విభజించి, ఆ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలని నిర్ణయించింది. సోమవారం జరిగిన సమావేశంలో అపోలో హాస్పిటల్స్, దాని అనుబంధ సంస్థ అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ (ఏహెచ్‌ఎల్) డైరెక్టర్ల బోర్డులు ఇందుకు సూత్రప్రాయ ఆమోదం తెలిపాయి. అయితే కొత్త కంపెనీ పేరును ఇంకా నిర్ణయించలేదు. ఈ విభజన, షేర్ల లిస్టింగ్ ప్రకియను 18 నుంచి 21 నెలల్లో పూర్తి చేయాలని ఏహెచ్‌ఈఎల్ భావిస్తోం ది.ఈ విభజన ద్వారా ఏహెచ్‌ఈఎల్ ఈక్విటీలో 100 షేర్లు ఉన్న ప్రతి వాటాదారుకు.. కొత్తగా ఏర్పాటు చేసే ఫార్మసీ, డిజిటల్ హెల్త్ కంపెనీలో 195.2 షేర్లు లభిస్తాయి.

**విభజన ప్రక్రియ ప్రధానాంశాలు**

తొలి దశలో ఫార్మసీ డిస్ట్రిబ్యూషన్, అపోలో 24/7 డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్, రిమోట్ టెలిహెల్త్ వ్యాపారాలను ఏహెచ్‌ఈఎల్ నుంచి ప్రత్యేక కంపెనీగా విభజిస్తారు.

రెండో దశలో అపోలో హెల్త్ కంపెనీని కొత్త కంపెనీలో విలీనం చేస్తారు.

మూడో దశలో హెూల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన కంపెనీలో విలీనం చేస్తారు.

ఈ విభజనతో గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.16,300 కోట్లుగా ఉన్న ఫార్మసీ, డిజిటల్ హెల్త్ విభాగాల ఆదాయం 2027 మార్చి నాటికి రూ.25,000 కోట్లకు చేరుతుందని అంచనా.




విభజనతో ఏర్పడే కొత్త కంపెనీ పూర్తి భారతీయుల యాజమాన్యం, నిర్వహణలో ఉన్న కంపెనీ (ఐఓసీసీ) అవుతుంది. ఈ కొత్త కంపెనీకి అపోలో గ్రూప్ నిర్వహణలోని ఫ్రంట్ ఎండ్ ఫార్మా కంపెనీ అయిన అపోలో ఫార్మసీస్ లిమిటెడ్ (ఏపీఎల్) ఈక్విటీలో 100 శాతం వాటా ఉండనుంది.

ఏహెచ్‌ఈఎల్‌కు కొత్త కంపెనీ ఈక్విటీలో 15 శాతం వాటా.కొత్తగా ఏర్పడే కంపెనీ బోర్డులోనూ ఏహెచ్‌ఈఎల్‌కు ఒక నామినీ డైరెక్టర్ పోస్టు.వాటాదారులు, రెగ్యులేటరీ సంస్థల ఆమోదం లభించిన తర్వాత కొత్త కంపెనీకి ఫ్రంట్ ఎండ్ ఫార్మా బిజినెస్ కంపెనీ అపోలో మెడికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటీలోనూ 74.5 శాతం వాటా.అపోలో హెల్త్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని.. కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీకీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.ఏహెచ్‌ఈఎల్ ప్రమోటర్లు అందరూ కొత్త కంపెనీ బోర్డులో సభ్యులుగా ఉంటారు.

## హెచ్‌పీవీ 9 వ్యాక్సిన్ తయారీలోకి బీఈ



ప్రజలను హ్యూమన్ పాపిలోమా వైరస్ నుంచి కాపాడేందుకు హెచ్‌పీవీ 9 వ్యాక్సిన్ తయారీ కోసం చైనా బయోఫార్మాస్యూటికల్ కంపెనీ రెక్‌బయో టెక్నాలజీతో హైదరాబాద్ కేంద్రం గా ఉన్న బయోలాజిక్-ఈ (బీఈ) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు బీఈతో లైసెన్సింగ్ సహకార ఒప్పందం కుదిరినట్టు జియాంగ్సు రెక్‌బయో టెక్నాలజీ కంపెనీ వెల్లడించింది. ఈ ఒప్పందానికి అనుగుణంగా బీఈకి తాము రీ కాంబినెంట్ 9-వాలెంట్ హెచ్‌పీవీ (హెచ్‌పీవీ 9) వ్యాక్సిన్ టెక్నాలజీ బదిలీని ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. అలాగే ఆ వ్యాక్సిన్ తయారీకి అవసరమైన ముడి పదార్థాన్ని (డీఎస్) కూడా రెక్‌బయో అందిస్తుంది. టెక్నాలజీ బదిలీ పూర్తి కాగానే భారీ పరిమాణంలో హెచ్‌పీవీ9 వ్యాక్సిన్ తయారీని బీఈ ప్రారంభిస్తుంది. వ్యాక్సిన్‌కు సంబంధించిన క్లినికల్ డెవల్‌పమెంట్, రెగ్యులేటరీ అనుమతుల విషయంలో బీఈకి అవసరమైన మద్దతును అందించనున్నట్టు రెక్‌బయో తెలిపింది. ఇదిలా ఉండగా ఆ వ్యాక్సిన్ తమ ప్లాంట్‌లో తయారుచేసి, దేశం లో వాణిజ్యపరంగా విడుదల చేయడంతో పాటు యునిసెఫ్, పీఏహెచ్‌ఓ టెండర్లలో పాల్గొనే అవకాశం బీఈకి ఈ ఒప్పందం ద్వారా లభిస్తుంది. సర్వైకల్, వుల్వా, వెజైనల్, ఆనల్, ఓరోఫరింజియల్ క్యాన్సర్లు సహా 9 రకాల క్యాన్సర్లకు కారణమయ్యే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) చికిత్స కోసం జెనెటిక్ ఇంజనీరింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి తయారుచేసే (రీకాంబినెంట్) వ్యాక్సిన్ ఇది. 9-45 సంవత్సరాల మధ్య వయస్కుల్లో వినియోగించే మరో కీలక ఉత్పత్తి ఆర్‌ఈసీ 603పై ప్రస్తుతం చైనాలో మూడో దశ క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి.

## జీఎస్‌టీ వసూళ్లు ఐదేళ్లలో రెట్టింపు




న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) చట్టం అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయింది. కేంద్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం జీఎసటీ వార్షిక వసూళ్లు గడిచిన ఐదేళ్లలో రెట్టింపయ్యాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.11.37 లక్షల కోట్లుగా నమోదుకాగా.. గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.22.08 లక్షల కోట్లకు పెరిగాయి. మరిన్ని విషయాలు..

2024-25లో జీఎసటీ ఆదాయం అంతక్రితం ఆర్థిక సంవత్సరం(2023-24)తో పోలిస్తే 9.4 శాతం వృద్ధి చెందాయి.

2020-21 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ వసూళ్ల సగటు రూ.95,000 కోట్లుగా నమోదుకాగా.. 2021-22లో రూ.1.51 లక్షల కోట్లకు, రూ. 2023-24లో రూ.1.68 లక్షల కోట్లకు, 2024-25లో రూ.1.84 లక్షల కోట్లకు పెరిగాయి.

జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్)లో నమోదు చేసుకున్న వ్యాపారులు (పన్ను చెల్లింపుదారులు) గడిచిన 8 ఏళ్లలో రెట్టింపునకు పైగా పెరిగారు. 2017లో వీరి సంఖ్య 65 లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం 1.51 కోట్లు దాటింది.

ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.2.37 లక్షల కోట్లకు చేరాయి. 2025 మే నెలలో రూ.2.01 లక్షల కోట్లుగా నమోదు కాగా.. జూన్ గణాంకాలు మంగళవారం విడుదల కానున్నాయి.

దేశవ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు 17 రకాల స్థానిక పన్నులు, 13 రకాల సుంకాల విలీనం ద్వారా రూపొందించిన జీఎస్‌టీ చట్టం 2017 జూలై 1న అమలులోకి వచ్చింది.

## ఏఎం గ్రీన్ చేతికి ఓరిక్స్ కార్ప్ వాటా




**గ్రీన్‌కో ఎనర్జీ హెూల్డింగ్స్‌లో 17.5శాతం వాటా కొనుగోలు డీల్ విలువ రూ.11,000 కోట్లు**

గ్రీన్‌కో ఎనర్జీ హెూల్డింగ్స్ కంపెనీలో జపాన్‌కు చెందిన ఆర్థిక సర్వీసుల కంపెనీ ఓరిక్స్ కార్పొరేషన్‌కు గల 17.5శాతం వాటాను ఏఎం గ్రీన్ బీవీ కొనుగోలు చేయనుంది. ఈ డీల్ విలువ 128 కోట్ల డాలర్లు (రూ.11,000 కోట్లు). గ్రీన్‌కో వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి, మహేశ్ కొల్లి ఇద్దరి యాజమాన్యంలోని సంస్థ ఏఎం గ్రీన్‌కు ఈ లావాదేవీ అనంతరం గ్రీన్‌కోలో 25శాతం వాటాలుంటాయి. గ్రీన్‌కోలో తనకు గల 20శాతం వాటాలో 17.5శాతంవాటాను ఏఎం గ్రీన్ పవర్ బీవీకి బదిలీ చేయడంతో పాటు దాని మాతృసంస్థ ఏఎం గ్రీన్ (లగ్జెంబర్గ్), సరళ్ (ఏఎంజీ లక్స్) జారీ చేసే కన్వర్టిబుల్ నోట్లలో 73.1 కోట్ల డాలర్లు (రూ.6,286.6 కోట్లు) ఓరిక్స్ కార్పొరేషన్ ఇన్వెస్ట్ చేస్తుంది. గ్రీన్‌కో దేశంలో పునరుత్పాదక ఇంధన కంపెనీలను కలిగి ఉండడంతో పాటు 10 గిగావాట్ల స్థాపి త విద్యుత్ సామర్థ్యం కూడా కలిగి ఉంది. 2021 నుంచి గ్రీన్‌కో వ్యాపార వృద్ధికి ఓరిక్స్ మద్దతు ఇస్తోంది.

## ఆధార్ నుంచి ఏటీఎం ఛార్జీల వరకూ.. జూలై 1 నుంచి రానున్న మార్పులివే..




జూలై 1 నుంచి భారతదేశంలో వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, బ్యాంకు ఖాతాదారుల జీవితాలను ప్రభావితం చేసే అనేక కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి. ఆదాయపు పన్ను రిటర్న్‌ల దాఖలు, క్రెడిట్ కార్డ్, తత్కాల్ రైలు టికెట్ బుకింగ్, కొత్త పాన్ కార్డ్ దరఖాస్తుకు ఆధార్ తప్పనిసరి చేయడం వంటి అనేక మార్పులు రానున్నాయి. ఈ మార్పులు వంటి బ్యాంకుల ఖాతాదారులపై కూడా ప్రభావం చూపించనున్నాయి.జూలై 1 నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ కొత్త పాన్ కార్డ్ దరఖాస్తులకు ఆధార్ వెరిఫికేషన్‌ను తప్పనిసరి చేసింది. ఇప్పటివరకు డ్రైవింగ్ లైసెన్స్ లేదా బర్త్ సర్టిఫికేట్ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులతో పాన్ కార్డ్ దరఖాస్తు చేయడం సాధ్యమవుతోంది. కానీ ఇకపై ఆధార్ లేకుండా కొత్త పాన్ కార్డ్ పొందడం కుదరదు. ఇప్పటికే పాన్ కార్డ్ ఉన్నవారు డిసెంబర్ 31, 2025 లోపు తమ పాన్‌ను ఆధార్‌తో లింక్ చేయాలి. ఈ నిబంధనను పాటించని వారి పాన్ కార్డ్‌లు డియాక్టివేట్ అయ్యే అవకాశం ఉంది. కాబట్టి, మీ పాన్‌ను ఆధార్‌తో లింక్ చేయడం మర్చిపోవద్దు.తత్కాల్ రైలు టికెట్ బుకింగ్‌లకు కూడా ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరి అవుతుంది. ఈ నిబంధన జూలై 1 నుంచి అమలులోకి వస్తుంది. అంతేకాదు జూలై 15 నుంచి, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ టికెట్ బుకింగ్‌లకు టూ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ అవసరం. ఈ ప్రక్రియలో మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వన్ టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. అదనంగా, రైల్వే శాఖ టికెట్ ధరలలో స్వల్ప పెంపును అమలు చేయనుంది. నాన్ ఏసి కోచ్‌లకు కిలోమీటర్‌కు 1 పైసా, ఏసి కోచ్‌లకు కిలోమీటర్‌కు 2 పైసలు ధరలు పెరగవచ్చు. ఈ మార్పులు ప్రయాణికుల బడ్జెట్‌పై కొంత ప్రభావం చూపించనున్నాయి. కాబట్టి ప్రయాణ ఖర్చులను ముందుగానే ప్లాన్ చేసుకోండి.

ఐటీఆర్ గడువు పొడిగింపు

ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు గడువును జూలై 31 నుంచి సెప్టెంబర్ 15 వరకు పొడిగించింది. ఈ 46 రోజుల అదనపు సమయం ఉద్యోగులకు తమ రిటర్న్‌లను దాఖలు చేయడానికి సౌలభ్యాన్ని కల్పిస్తుంది. అయితే, డాక్యుమెంట్లు సిద్ధంగా ఉ న్నవారు పాత గడువైన జూలై 31 లోపు రిటర్న్‌లను దాఖలు చేయడం మంచిది. ఎందుకంటే, గడువు దగ్గరపడే కొద్దీ వెబ్‌సైట్‌లో టెక్నికల్ సమస్యలు లేదా గ్లిచ్‌లు తలెత్తే అవకాశం ఉంది. ముందుగానే రిటర్న్ ఫైల్ చేస్తే, ఈ ఇబ్బందులను నివారించవచ్చు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006